క్లుప్తంగా

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు



విజయవాడరూరల్: నున్న గ్రామంలో గ్రామ పరిపాలన గాడి తప్పిందని.. సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని గ్రామవాసి, వైఎస్సార్ సీపీ నాయకుడు దండు సుబ్రహ్మణ్యం రాజు ఎంపీడీఓ బి.విగ్గిన్స్‌ను మంగళవారం కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. సచివాలయం-2, 3 గ్రేడ్ 5 కార్యదర్శులు సెలవులో ఉన్నందున రోజు వారి విధులు కూడా సక్రమంగా జరగడం లేదని, జూనియర్ అసిస్టెంట్, లైబ్రేరియన్ రోజూ వచ్చి వెళుతున్నారే తప్ప విధులు నిర్వర్తించడం లేదని తెలియజేశారు. ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి ఉండటంతో ఇంటి పన్ను వసూలు లాంటివి కూడా జరగడం లేదని తెలిపారు. సచివాలయ సిబ్బంది విధులను సక్రమంగా నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఎంపీడీఓను సుబ్రహ్మణ్యం రాజు కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



గన్నవరం: స్థానిక బీకేఆర్ వృద్ధాశ్రమంలోని అనాథ వృద్ధులు, బాలల భోజన సౌకర్యార్థం బ్యాంక్ ఆఫ్ బరోడా గన్నవరం బ్రాంచ్ సిబ్బంది నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆశ్రమ నిర్వాహకురాలు శేషుమాధవీకి సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ ఎ. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. నిరాశ్రయురాలైన వృద్ధులు, బాలలను ఆదుకోవడం సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ గుర్తించాలని చెప్పారు. తమ వంతు బాధ్యతగా వృద్ధాశ్రమానికి నిత్యావసరాలను అందజేసినట్లు తెలిపారు. వృద్ధులు, బాలలకు అండగా నిలిచేందుకు ముందుకు వచ్చిన దాతలకు ఆశ్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. బ్రాంచ్ క్రెడిట్ ఆఫీసర్ జి. సుమన్, సిబ్బంది బి. శ్రావణి, మధు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

2న రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ స్టేట్ చెస్ టోర్నమెంట్‌ను ఫిబ్రవరి 2వ తేదీన కానూరులో స్కూట్‌స్పిన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ డైరెక్టర్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎం.రాజీవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలో తొలిసారిగా నిర్వహించనున్న చెస్ టోర్నమెంట్‌లో కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని వెల్లడించారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి 20 మందికి నగదు బహుమతి, ప్రతి ఏజ్ గ్రూపులో మొదటి మూడు స్థానాలకు ప్రత్యేక బహుమతులు అందిస్తామని చెప్పారు. టోర్నమెంట్‌లో పాల్గొనే వారు శనివారం సాయంత్రం ఆరు గంటల లోపు తమ పేర్లను ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 97007 75220 నంబరులో సంప్రదించాలని కోరారు.

పంచాయతీ, సచివాలయ ఉద్యోగులతో డీపీఓ సమీక్ష



గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జిల్లా పంచాయతీ అధికారిణి జె. అరుణ నేతృత్వంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ స్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన కార్యక్రమాల అమలు తీరుపై ఆమె సమీక్ష జరిపారు. అనంతరం డీపీఓ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వాహణ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో పేరుకుపోయిన పన్నుల బకాయిల వసూళ్లపై ప్రధానంగా దృష్టి సారించాలని చెప్పారు. సమావేశంలో డీఎల్‌పీఓ సంపత్ కుమారి, పలువురు మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

సగర కులస్తులకు కల్యాణ మండపం నిర్మించాలి

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగరంలోని సగర కులస్తులకు కల్యాణ మండపం నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ సగర్ రాజ్‌పుత్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముద్రబోయిన వెంకట రమణయ్య, ఉపాధ్యక్షుడు కర్గ పాండురంగారావు డిమాండ్ చేశారు. ఇన్నర్‌రింగ్ రోడ్‌లో ఆంధ్రప్రదేశ్ సగర్ రాజ్‌పుత్ సేవా సమితి ఆధ్వర్యాన మంగళవారం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమ్మడి చంటి, సీపీఐ సీనియర్ నేత నక్క వీరభద్రరావు, వీఎంసీ ఈఈ ఏసుబాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏపీ సగర్ రాజ్ పుత్ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కగ్గా పాండురంగారావు మాట్లాడుతూ ప్రభుత్వం తమ కులస్తులకు కల్యాణ మండపాన్ని నిర్మించి ఇవ్వాలని కోరారు.

అడుగుకో గొయ్యి..



అధ్వానంగా ఉన్న ఉప్పలూరు-మంతెన లింకు రోడ్డు మార్గం

అడుగడుగునా గోతులు.. కోతకు గురైన రోడ్డు మార్జిన్‌లు.. రాకపోకలు సాగక అవస్థలు పడుతున్న ప్రజానీకం. ఇదీ మండలంలోని ఉప్పలూరు-మంతెన లింకు రోడ్డు మార్గం దుస్థితి. రోడ్డు మార్గం అధ్వానంగా తయారవ్వడంతో ప్రయాణం సాగక, వ్యవసాయ ఉత్పత్తుల తరలింపులోనూ అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు.

కంకిపాడు: మండలంలోని ఉప్పలూరు గ్రామం నుంచి మంతెన గ్రామానికి వెళ్లేందుకు లింకు రోడ్డు మార్గం ఉంది. వ్యవసాయ భూముల్లోకి వెళ్లేందుకు ఈ రోడ్డు మార్గం ఎంతో ఉపయోగంగా ఉంటుంది. అంతేకాకుండా మంతెన, తెన్నేరు గ్రామంలోని రైల్వేస్టేషన్‌కు చేరుకునేందుకు దగ్గర మార్గంగా ప్రజలు ఈ రోడ్డు మార్గాన్ని వినియోగిస్తున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రోడ్డు మార్గం రద్దీగా ఉంటుంది.

అవస్థలు పడుతున్న ప్రయాణికులు

గోతులమయంగా రహదారి

ఈ రోడ్డు మార్గం ప్రస్తుతం పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా తయారైంది. మార్జిన్‌లు ధ్వంసమై పూర్తిగా కోతకు గురయ్యాయి. ఉప్పలూరు, మంతెన గ్రామాలకు చెందిన రైతాంగం ఇక్కడ ఉన్న వ్యవసాయ భూములకు చేరుకోవడానికి ఈ రోడ్డు మార్గాన్నే వాడుతున్నారు. రహదారి మార్గం ధ్వంసం కావడంతో రాకపోకలు సజావుగా సాగక ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు వరి, కూరగాయలు, మినుము, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు రైతాంగం ఈ మార్గాన్నే వినియోగించుకుంటున్నారు. రహదారి దెబ్బతినడంతో వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు సైతం అవస్థ పడుతున్నారు. ఆటోలు, వ్యాన్లలో ప్రధాన మార్గానికి ఉత్పత్తులను తరలించి అక్కడి నుంచి భారీ వాహనాల్లో ఉత్పత్తులను ఎగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి. ఫలితంగా ఎగుమతి, దిగుమతులకు అధికంగా పెట్టుబడి వ్యయం అవుతుందని రైతులు వాపోతున్నారు. మరో కొద్ది రో జుల్లో రబీ ఉత్పత్తులు కూడా చేతికి అందబోతున్నా యి. అప్పటికైనా రోడ్డు మార్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే రాకపోకలకు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఆటంకం ఉండదని రైతులు భావిస్తున్నారు. రోడ్డు అభివృద్ధికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

డీఎస్పీ శ్రీనివాసరావు



తాడిగడప జంక్షన్‌లో హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, పోలీసులు

పెనమలూరు: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు సూచించారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కానూరు నుంచి తాడిగడప జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాడిగడప జంక్షన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కారు నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని, ఇది అందరి బాధ్యతని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీవో శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, పెనమలూరు సీఐ వెంకటరమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పశుపోషణపై అవగాహన అవసరం



గోసాల పశువైద్య శిబిరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

పెనమలూరు: పశుపోషకులకు పశువుల పెంపకంపై పూర్తి అవగాహన ఉండాలని పోరంకి పశువైద్యుడు డాక్టర్ వి.బాబూరావు అన్నారు. గోసాల గ్రామంలో మంగళవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబూరావు మాట్లాడుతూ పశుపోషణలో సమస్యలు వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డులు, లింగ నిర్ధారణ పరీక్షలు, పిండ మార్పిడిపై అవగాహన కల్పించారు. కాగా శిబిరంలో గేదెలు, ఆవులకు చూడి పరీక్షలు చేశారు. తిరగ పార్లే పశువులకు వైద్యం చేసి మందులు ఇచ్చారు. అనంతరం పశువైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యుడు ఆసిఫ్‌పాషా, పశువర్ధక శాఖ అధికారులు టి.రామమోహనదాసు, ఎల్.రాఘవేంద్రరావు, డి.నిఖిత పాల్గొన్నారు.

మెగా పశు వైద్య శిబిరం



మంతెనలో పాడిరైతులకు మినరల్ మిక్చర్ పంపిణీ చేస్తున్న పశువైద్య అధికారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలో పశుగణాభివృద్ధి సంస్థ(గన్నవరం), క్రిభ్‌కో ఎరువుల కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మెగా పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ కట్టుబోయిన నాగమణి శిబిరాన్ని ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాడి రైతులు గేదేలను ఈ శిబిరానికి తీసుకురావడంతో పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థకు చెందిన పశు వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. పశు పోషణలో అవలంభించాల్సిన పద్ధతులు, జాగ్రత్తలను పాడిరైతులను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్.చిన్న నరసింహులు వివరించారు. పాడి రైతులకు పాల క్యాన్లు, పశువుల మందులు, మినరల్ మిక్చర్లను ఉచితంగా పంపిణీ చేశారు. వీబీఆర్ఐ (విజయవాడ) డీడీ డాక్టర్ పద్మ, పశుసంవర్ధక శాఖ గన్నవరం డీడీ డాక్టర్ గోపిచంద్, బాపులపాడు ఏడీ డాక్టర్ శ్రావణ్‌కుమార్, పశుగణాభివృద్ధి సంస్థ ఏడీ డాక్టర్ హరిత, మండల పశువైద్యాధికారి డాక్టర్ దివ్య, పశుగణన సహాయకుడు కె.రామకృష్ణ, మల్లవల్లి ఎంపీటీసీ సభ్యుడు వెంకట నారాయణ, గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు జమలయ్య, పాల కేంద్రం అధ్యక్షుడు అక్కినేని కృష్ణాజీ, క్రిభ్‌కో కంపెనీ ప్రతినిధులు షేక్ అక్రమ్, బి.రోహన్ పాల్గొన్నారు.

పెయ్య దూడల అందాల పోటీలు

పశు వైద్య శిబిరం ప్రాంగణంలో నిర్వహించిన పెయ్య దూడల అందాల పోటీలు ఆకట్టుకున్నాయి. పరిసర గ్రామాలకు చెందిన 56 దూడలను పాడిరైతులు ఈ పోటీలకు తీసుకువచ్చారు. ఈ దూడలను పశువైద్య అధికారులు పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో పాడిరైతు పిన్నిబోయిన సుబ్రహ్మణ్యం ప్రథమ బహుమతి సొంతం చేసుకోగా, కట్టుబోయిన వెంకయ్య రెండో స్థానాన్ని, పరసా వెంకటేశ్వరరావు మూడో స్థానాన్ని కై వసం చేసుకున్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన



ముదిరాజులపాలెంలో కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించిన ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెంకట్రావు

గన్నవరం రూరల్: మండలంలోని ముదిరాజు పాలెంలో రూ. 15లక్షలతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశా రు. అనంతరం చిక్కవరం బ్రహ్మలింగం చెరువులో పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా చేప పిల్లలను వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సర్పంచ్ అన్నే లక్ష్మణరావు, కంచర్ల నాగబాబు, చిట్టినేని జోజిబాబు, అధికారులు పాల్గొన్నారు.

కాపు కల్యాణ మండప నిర్మాణానికి..

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక గుడివాడ రోడ్డులోని ఇందిరానగర్‌లో ఎంపీ లాడ్స్ నిధులు రూ. 50 లక్షలతో చేపట్టిన కాపు కల్యాణ మండప నిర్మాణ పనులకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి మంగళవారం ఎంపీ వల్లభనేని బాలశౌరి శంకుస్థాపన చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన రూ. 25 లక్షలతో నిర్మించిన భవనానికి అదనంగా ఎంపీ నిధులు రూ. 50 లక్షలతో కల్యాణ మండపం నిర్మాణాన్ని విస్తరించనున్నారు. దాతల విరాళాలను కూడా కలిపి అంచనా వ్యయం రూ.1.80 కోట్లతో కల్యాణ మండపాన్ని నిర్మించ తలపెట్టామని ఎంపీ బాలశౌరి తెలిపారు. జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

పెనమలూరు: పోరంకి గ్రామంలో యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. చిల్లకల్లుకు చెందిన అబ్దుల్‌జిలానీ తన కుటుంబ సభ్యులతో పోరంకిలో ఉంటున్నాడు. అతనికి ఒక కుమార్తె, కుమారుడు. కుమార్తె ఇంట్లో ఉండి ఇంటర్ ప్రైవేటుగా చదువుతోంది. అయితే కుమార్తె సోమవారం ఇంట్లో నుంచి అదృశ్యమైంది. తల్లితండ్రులు ఆమె ఆచూకీ కోసం యత్నించగా ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. దీంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నప్రసాద వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయునికి తమలపాకులతో విశేష పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాత ప్రదీప్‌కుమార్, శ్రావణిల సహకారంతో 200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపిక

గన్నవరం: స్థానిక కొత్తపేటలోని రోటరీక్లబ్ ఆడిటోరియంలో మంగళవారం అమరరాజా గ్రూపు సంస్థల సహకారంతో జాబ్‌మేళా నిర్వహించారు. తొలుత జాబ్‌మేళాను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. మిషన్ ఆపరేటర్ల ఉద్యోగాల కోసం పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులను ఇంటర్వ్యూ పద్ధతిలో ఆ సంస్థ ప్రతినిధులు ఎంపిక చేశారు. అనంతరం ఎంపికై న అభ్యర్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి పరిశీలన

అనంతరం ఎంపీ వల్లభనేని బాలశౌరితో కలిసి ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శారమ్మతో మాట్లాడిన తర్వాత ఆస్పత్రిలో నాలుగు అదనపు గదుల నిర్మాణం, మరుగుదొడ్ల మరమ్మతులకు నిధులు కేటాయిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. అనంతరం వ్యాక్సిన్ స్టోరేజ్ సెంటర్‌ను పరిశీలించారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

కంకిపాడు: కాలిన గాయాలతో చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందిన ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని ప్రొద్దుటూరు శివారు కొణతనపాడు గ్రామానికి చెందిన కొడాలి శ్వేత, తన భర్తతో కలిసి గతేడాది డిసెంబరు 31న పని నిమిత్తం బయటకు వెళ్లింది. అదే సమయంలో ఒంటరిగా ఆరుబయట అగ్గిపెట్టెతో ఆడుకుంటున్న వారి కుమార్తె నిత్య(6)కు ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకుంది. ఇరుగుపొరుగు వారు గుర్తించి మంటలు ఆర్పి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. గాయాలపాలైన చిన్నారి నిత్యను మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం చిన్నారి మృతి చెందింది. తల్లి శ్వేత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఒకటిన గన్నవరంలో 'బాలోత్సవం'



గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 1వ తేదీన బాలోత్సవంలో భాగంగా తృతీయ పిల్లల పండుగ నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో బాలోత్సవం బ్రోచర్‌ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలోత్సవంలో గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. మొత్తం 33 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థుల ఎంట్రీలకు సంబంధించిన వివరాలను ఈ నెల 29వ తేదీలోపు హెచ్ఎంలు పంపించాలని తెలిపారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ఈ పోటీలు దోహదపడతాయని కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు గన్నె వెంకట్రావు చెప్పారు. కమిటీ ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్, హెచ్ఎం ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు తక్కువగా వాడాలి

జిల్లా వ్యవసాయాధికారిణి పద్మావతి



వణుకూరులో పొలం పిలుస్తోందిలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారిణి పద్మావతి

పెనమలూరు: రైతులు రసాయన ఎరువులను తక్కువగా వాడి నాణ్యమైన దిగుబడులు సాధించాలని కృష్ణాజిల్లా వ్యవసాయాధికారిణి ఎన్.పద్మావతి సూచించారు. వణుకూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు పలు సూచనలు ఇచ్చారు. రైతులు వారు సాగు చేసే పంటలకు ఎటువంటి ఎరువులు వాడాలో వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తీసుకోవాలని చెప్పారు. మినుము పంటలో ఎరువులు ఎక్కువగా వాడితే మొక్క భౌతిక స్వరూపం మారుతుందన్నారు. మొక్కజొన్న పంట సాగులో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ, వీఏఏలు కిరణ్మయి, చాముండేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

నున్న గ్రామంలో..



నున్నలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి విజయకుమారి

నున్న(విజయవాడరూరల్): వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నున్న రైతుసేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఉద్యానశాఖ అధికారి వి.నీలిమా మాట్లాడుతూ 50 శాతం సబ్సిడీపై మామిడి రైతులకు ఫ్రూట్ కవర్స్ అందచేయడం జరుగుతుందని వాటిని తీసుకోవాలని చెప్పారు. పశుసంవర్ధక శాఖ సహాయకురాలు జయశ్రీ పాడిపశువుల కొనుగోలుకు బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కాగా యూరియా సమస్య ఏర్పడి అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేయాల్సి వచ్చిందని, సమస్య రాకుండా చూడాలని రైతులు కోరారు. కార్యక్రమంలో ఏడీ బి.వెంకటేశ్వరరావు, గ్రామ రైతులు చాగంటి వెంకటరెడ్డి, యర్కారెడ్డి బుజ్జి, భీమవరపు అప్పిరెడ్డి, కోటిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండలరెడ్డి, వ్యవసాయశాఖ అధికారి సురేష్, సహాయకులు మౌనిక, హిమబిందు పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలోని మానికొండలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి హరీష్‌కుమార్ పాల్గొని రైతులకు సూచనలు చేశారు. మండలంలో సుమారు 2,200 ఎకరాలు అపరాలు సాగు చేస్తున్నారని చెప్పారు. రైతులు పురుగు, తెగుళ్లకు అవసరానికి మించి మందులను పిచికారి చేయకూడదని, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది అపరాల సాగు, దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో వీఏఏలు మురళీకృష్ణ, భానుప్రియ, రైతులు పాల్గొన్నారు.

మినుము, పెసర పంటల పరిశీలన

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కాకులపాడులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మినుము పంటలను మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని మంగళవారం పరిశీలించారు. ప్రస్తుత వాతావరణంలో ఉష్ణోగ్రత తక్కువగా, గాలిలో తేమశాతం అధికంగా ఉండటంతో మినుము, పెసర పంటలకు తెగుళ్ల అధికంగా సోకే అవకాశం ఉందని ఏఓ భవాని చెప్పారు. పలువురు రైతుల పొలాల్లో మినుము పంటకు మచ్చల పురుగులు సోకినట్లు గుర్తించామని వివరించారు. దీని నివారణకు 1500 పీపీఎం వేపనూనెను ఎకరాకు ఒక లీటరు చొప్పున పిచికారీ చేయాలని ఆమె సూచించారు.

మంతెనలో వైఎస్సార్ సీపీ బ్యానర్ల చించివేత



చించివేసిన బ్యానరు వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కంకిపాడు: మంతెన ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ బ్యానర్లను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్తలు గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహం సెంటరులో బ్యానర్లు ఏర్పాటు చేశారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు బ్యానర్లు చించివేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నేతలు ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను కంకిపాడు ఎస్ఐ డి.సందీప్ దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ బీసీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండవీటి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న పల్లెలను కొందరు అధికార పక్షానికి చెందిన వ్యక్తులు కలుషితం చేస్తున్నారన్నారు. విధ్వంసకర చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు. గడిచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో రాజకీయాలకు తావులేకుండా అన్ని వర్గాలకు, పార్టీలకూ సంక్షేమ పాలన అందిందన్నారు. పల్లెల్లో విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బంట్రుపల్లి గగన్, మేడంకి బాబీ, వీరంకి రాంబాబు, లక్కపల్లి ప్రవీణ్, పినమాక శశి, కోలవెంటి తంబి, మద్దిపాటి చందు, వీరంకి కోటేశ్వరరావు, కొండేటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన జీవనం



పెనమలూరులో మాట్లాడుతున్న బోధనాచార్యులు శ్రీనివాసరావు

పెనమలూరు: యోగా చేయడం వల్ల ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఉప ప్రధాన బోధకాచార్యులు శ్రీ మంద్రు శ్రీనివాసరావు(యధాశక్తి) గురూజీ అన్నారు. గోసాల శాఖ ఆధ్వర్యంలో పెనమలూరు కిలారు అనిల్ ఎస్టేట్స్‌లో జరుగుతున్న 65వ యోగా శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. యోగాతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అందరూ క్రమం తప్పకుండా యోగా అభ్యసించాలని కోరారు. ప్రధాన గురువు శ్రీవేంకటేశ్వర యోగి గురూజీ యోగా ప్రాముఖ్యతను వివరించారు.

2 నుంచి యోగా శిక్షణ శిబిరం

కాగా 66వ ఉచిత యోగా శిక్షణ శిబిరం వచ్చే నెల 2వ తేదీ ఆదివారం పెనమలూరు గ్రామం హైస్కూల్‌లో ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. 28రోజుల పాటు ప్రతి రోజూ ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణలో చేరే వారు 91333 06804 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించండి

పాయకాపురం(విజయవాడరూరల్): పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పిల్లలను తీసుకురావాలని డాక్టర్ డి.రాథోడ్ అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. విజయవాడ నగరంలోని 678వ నంబరు సచివాలయంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు, వైద్య సహాయకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాథోడ్ మాట్లాడుతూ పిల్లల్లో గ్రహణంమొర్రి, చిన్నతలతో పుట్టడం, పాదాలు వంకరలు పోయి ఉండటం, దొడ్డు కాళ్లు, ఇలాంటి పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి వైద్య సహాయకులు(ఏఎన్ఎం)లకు తెలియజేసి వారికి చికిత్స చేసేందుకు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావాలని సూచించారు. పిల్లల్లో రక్తహీనత, వినికిడి లోపం, దృష్టిలోపం, ప్రోటీన్ లోపం గల పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. పోషక విలువలు గల ఆహార పదార్థాలను పిల్లలకు పెట్టాలని సూచించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.